# దేవుడోయ్ ! దేవుడా !

' ఏదేశమేగినా ఎందుకాలిడినా ' అన్నట్లుగా ఏ పండగొచ్చినా, ఏ వుత్సవం జరిగినా మిత్రద్వయం చిట్టిపొట్టి విధిగా అక్కడుండి తీరతారు. వాళ్ళకి వుత్సాహం జాస్తి. గుళ్ళో బాజాలు మ్రోగితే తమింట్లో శుభకార్యం జరుగుతున్నట్లుగా వుప్పొంగిపోతారు. శ్రీరామ నవమికి బజారతంతా పందిళ్ళు వేస్తే, వాళ్ళిద్దరూ మొహాలన్నీ ఇంతింత కుంకుమబొట్లు పెట్టుకుని ఆ చల్లని పందిళ్ళలో పెద్దలకి మించిన నిర్మలత్వంతో తిరుగుతూ హడావుడి పడిపోతారు.

లేతలేత ఆకుల్లాంటి ఆ పిల్లలు మనస్సుకు కుళ్ళు, కల్మషం తెలీదు. స్వార్థం , వంచన అసలే తెలీవు. కులం, మతం పట్టింపులు వాళ్ళకుండవ్. వయస్సు పెరుగుతున్న కొద్దీ వాటిన్నటిని వాళ్ళ తెల్లకాగితాల్లాంటి మనస్సులో నల్లగా వ్రాసేది మనమే – పెద్దవాళ్ళం …తులసి చెట్టుని ముళ్ళకంచెలా మార్చగలిగే ఘనత పెద్దలకి దక్కుతుంది.

ఆరోజు వినాయక నిమజ్జనం.

గత నాలుగు రోజులుగా వినాయక వుత్సవాలు వీధి యువజన సంఘ కార్యకర్తలు కదు వుత్సాహంతో ( బక్తితో కాదు ) జరిపించారు. వీధి వీధంతా పందిళ్ళు వేసేరు. రకరకాల , రంగు రంగుల బల్బులు అమర్చారు. ఇంటి ఇంటికి తిరిగి చందాలు వసలూచేసేరు. భక్తితో కొద్ది మంది భయంతో చాలా మంది చందాలు సమర్పించారు. అసలు చిట్టిపొట్టికి హడావుడి అక్కడ్నించే మొదలైంది. కార్యకర్తలతో పాటుగా వాళ్ళిద్దరూ గూడా కొంప కొంపకి తిరిగేరు పందిళ్ళు వేస్తున్నప్పుడు దీపాలు అమరుస్తున్నప్పుడు , ఆరడుగుల వినాయక విగ్రహాన్ని బండిలో తెస్తున్నప్పుడు ….. ప్రతిదశలో వాళ్ళిద్దరూ అక్కడేఉన్నారు. ఆపైన పూజాకార్యక్రమం, ప్రసాదాల పంపకం, సాయంకాలాలు సాంస్కృతిక కార్యక్రమాలు దగ్గరుండి పూర్తి చేయించారు.

నాలుగు రోజుల వుత్సవాలు పూర్తయ్యి, ఆ సాయంత్రం ఆరడుగుల విఘ్నేశ్వరుడ్ని బండీపై వుంచి నిమజ్జనానికి ఊరేగింపు బయల్దేరింది.

జనం….. జనం….. వెర్రిజనం

మతం తాలూకు గుర్తులు, మూర్ఖత్వం తప్ప ఆ జనంలో నిజమైన భక్తిభావం ఏ ఒక్కరిలోనూ లేదు. వెర్రి ఆవేశం, వెర్రితలలు వేసిన భక్తి భావం .....వందలు , వేలుగాజనం ఆ వూరేగింపులో వున్నారు. పెద్దగా గొంతులు చించుకుని ' వినాయక మహారాజుకి జై ' అంటూ దిక్కులు వులిక్కిపడేటట్లు అరుస్తున్నారు.

అన్నివేలమంది జనంలో నిజంగా బక్తితో బరువెక్కిఏన గుండెలతో వున్నది వాళ్ళిద్దరే చిట్టి పొట్టి. వాళ్ళకేంటో బాధగా వుంది. మాటల్లో చెప్పలేనిది. నాలుగు రోజులుగా వాళ్ళల్లో వున్న సంతోషం చటుక్కున మాయమైపోయి, చెప్పలేని భాదగా వుంది, నిలువెత్తు దేవుడు , నిండైన దేవుడు వెళ్ళిపోతున్నాడు. సేవలు చేయించకున్న దేవుడు సెలవు పుచ్చుకుంటున్నాడు – లేతాకుపైని గొంగళిపురుగులాంటి బాధ.

వూరేగింపు కదిలి వెళ్ళిపోతోంది. జనం విరగ తొక్కుకుంటున్నారు. చిట్టిపొట్టి అంత జనం లోంచి దూసుకుంటూ దేవుడి బండీని చేరాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. కాని జనం వాళ్ళిద్దర్ని నెట్టి పారేస్తున్నారు. పది నిమిషాల ప్రయత్నం తర్వాత వాళ్ళు బండిని సమీపించగలిగారు. దేవుడు కరుణించాడు. కాని పూజారి విసుక్కున్నాడు. కోపంగా అరిచేడు. ఆ పూజారి బాగా చదువుకున్నవాడే . దేవుడి సమక్షంలో నిత్యం బతికేవాడే. కాని ఆయనకింకా జ్ఞానదంతాలు మొలిచినట్టు లేవు దేవుడి చిరునామా తెల్సుకోలేని అమాయకుడు.

తన ప్రక్కకొచ్చిన ఆ పిల్లలిద్దర్ని విసుగ్గా, బలంగా వెనక్కి నెట్టేశాడు. చిట్టి, పొట్టి ఒకే సారి ప్రక్కనేవున్న రాళ్ళ దిబ్బపై పడ్డారు. కాళ్ళు చేతులు చెక్కుకుపోయినాయ్. రక్తం చిమ్మింది. నెప్పి కాల్చేస్తుంది. బాధని భరించలేక చిట్టి దేవుడు పెద్దగా ఏడ్చాడు. పొట్టి దేవుడి కళ్ళల్లో గూడా నీళ్ళు సుళ్ళుతిరిగాయ్.

ఈ విషయం భక్త కోటికి తెలీదు. కదిలే దేవుళ్ళని కాలదన్ని, మట్టి దేవుడ్ని మ్రోసుకుంటూ వూరేగింపు ముందుకు సాగింది.

------- అయ్యిపోయింది -------